క్లుప్తంగా

ఎన్నికల ఫలితాల ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు



వైరా బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్

వైరా: నేడు దేశ వ్యాప్తంగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఫలితాలను ప్రజలు వీక్షించే విధంగా వైరా మున్సిపల్ అధికారులు వైరా బస్టాండ్ ఆవరణలో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియ గతంలో ఎన్నడూ ఏ ఎన్నికలలో జరగలేదు. మొదటి సారిగా జిల్లాలో ఇలాంటి ఏర్పాట్లు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సత్తుపల్లి పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా రాజేష్



పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్‌ను సత్కరిస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: తపాలా శాఖ సత్తుపల్లి డివిజన్ ఇన్‌స్పెక్టర్‌గా జి.రాజేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ సూర్యాపేటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కేరళ రాష్ట్రం నుంచి రాజేష్ బదిలీపై సత్తుపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా రాజేష్‌కు ఏఐజీడీఎస్‌యూ సంఘం బాధ్యులు బాణాల కృష్ణప్రసాద్, కోటమర్తి వెంకటేశ్వరరావు, మహేష్, రమేష్, పోస్ట్‌మాస్టర్ సురేష్, తపాలా ఉద్యోగులు రాజా, రవీంద్ర తదితరులు అభినందనలు తెలిపారు.

శివాలయంలో అన్నదానం ప్రారంభం



శివాలయంలో అన్నదానం చేస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని వెంగళరావునగర్‌లో గల శ్రీభ్రమరాంభిక సమేత మల్లిఖార్జున స్వామి(శివాలయం)లో ప్రతి సోమవారం చేపట్టే అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రామడుగు గురుబ్రహ్మాచార్యులు ప్రారంభించారు. ముందుగా శివలింగానికి విశేష పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన మరడ భాస్కర్‌రావు, సత్యవతి దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రామడుగు పద్మ, కమిటీ సభ్యులు కొలిపర బాబురావు, బాలాజీ, శ్రీనివాసరావు, మొగధంపురం నర్సింహాచారి, శరత్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఓలేటి శ్రీహరి, శంకర్, మాధురి మధు, సురేష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ రాము సేవలు మరువలేనివి



రాము చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


తల్లాడ: మాజీ ఎంపీపీ కాంపల్లి రాము సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నారాయణపురంలో నిర్వహించిన సంతాప సభలో నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఎంసీ మాజీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, వివిధ పార్టీల నాయకులు వేమిరెడ్డి కృష్ణారెడ్డి, దుండేటి వీరారెడ్డి, చల్లా నాగులు, నరేష్, మోదుగు ఆశీర్వాదం, రాము, రమేష్, రోజాను, సుదర్శన్ పాల్గొన్నారు.

నేడు స్వామివారి కల్యాణం

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడు శ్రీవిశ్వధర్మక్షేత్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు అన్నపూర్ణేశ్వరి సహిత మోక్ష రుద్రేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని.. కల్యాణోత్సవానికి పీటలపై కూర్చొనే దంపతులు పూజ సామగ్రిని తామే ఏర్పాటు చేస్తామన్నారు. ముందుగా మీ పేరును సెల్ నంబర్ 9440186180కు ఫోన్ చేసి నమోదు చేయించుకోవాలని కోరారు.

మధిరలో మెజార్టీ ఎవరికో..

- రాజకీయ పార్టీల్లో వాడీ వేడి చర్చ
- కాంగ్రెస్‌కి అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ పార్లమెంట్ ఎన్నికల్లో వస్తుందా?
- ప్రభుత్వంపై వ్యతిరేకత కలిసొస్తుందంటున్న బీఆర్ఎస్
- మోదీ పథకాలపై బీజేపీ నమ్మకం



మధిర: ఇటీవల జరిగిన ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో మధిర నియోజకవర్గానికి సంబంధించి ఏ పార్టీ అభ్యర్థికి మెజార్టీ వస్తుందోనని రాజకీయ వర్గాల్లో వాడీ వేడిగా చర్చ జరుగుతుంది. సీపీఎం, సీపీఐ మద్దతుతో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డికి ఎంత మెజార్టీ వస్తుందని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతుంది.

గత అసెంబ్లీ లాగానే.. పార్లమెంట్‌లో కూడా..

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకి మధిర నియోజకవర్గంలో 35,452 ఓట్ల మెజార్టీ వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఆ మెజార్టీ వస్తుందా? లేదా? అనేది హాట్ టాపిక్‌గా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం సీపీఐ మాత్రమే కాంగ్రెస్‌కి మద్దతు ప్రకటించగా, మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి సీపీఎం అదనంగా మద్దతు ప్రకటించారు.

నియోజకవర్గంలో బలంగా కమ్మ సామాజిక వర్గం..

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా కమ్మవారికి ఒక స్థానం కూడా కేటాయించకపోవడంతో.. వారు కాంగ్రెస్ పట్ల కొంత అసంతృప్తికి గురై నామ నాగేశ్వరావుకి ఓట్లు వేసినట్లు ప్రచారం జరుగుతుంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఆ సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నేతలు కొంత మంది పలు రహస్య సమావేశాలు ఏర్పాటు చేసినట్లు కూడా ప్రచారం జరుగుతుంది.

ఆందోళనలో కాంగ్రెస్ నాయకులు..

అసెంబ్లీ ఎన్నికల్లో మధిరలో టీడీపీ నాయకులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించగా.. పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థిగా పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుకి మద్దతు ప్రకటించడంతో కాంగ్రెస్ అభ్యర్థికి కొంత మెజార్టీ తగ్గుతుందేమోనని ఆందోళనలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాత్రం నియోజకవర్గంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

గెలుపుపైనే పార్టీ శ్రేణుల ఆశలు..

అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వచ్చిన మెజార్టీ కంటే రెట్టింపు మెజార్టీ రావాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన తాండ్ర వినోద్‌రావుకి ఎమ్మార్పీఎస్, టీడీపీ మద్దతు ఉండటంతో ఆ పార్టీ కూడా నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో ఓట్లు సాధిస్తారని ప్రచారంలో ఉంది. గతంలో మధిర నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణ మాదిగ పోటీ కూడా చేశారు.

మధిర నియోజకవర్గంలో..

పార్లమెంట్ ఎన్నికల్లో మధిర నియోజకవర్గంలో మొత్తం 2,22,160 ఓట్లు ఉండగా వాటిలో 1,81,815 ఓట్లు పోలయ్యాయి. రెడ్డి సామాజిక వర్గం బలంగా ఉన్న ఎర్రుపాలెం మండలంలో కాంగ్రెస్ అభ్యర్థికి భారీ స్థాయిలో మెజార్టీ వస్తుందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. నామ నాగేశ్వరరావుకు మాత్రం గత పార్లమెంట్ ఎన్నికల్లో మధిర నియోజకవర్గంలో నుంచి భారీ మెజార్టీ వచ్చిందని, ఈసారి కూడా మధిర నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు భారీ మెజార్టీ వస్తుందని ధీమాలో ఉన్నారు. మొత్తం మీద కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మధిర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మెజార్టీ తమకంటే, తమకే అంటూ రెండు పార్టీల నాయకులు లెక్కల్లో మునిగిపోయారు. మరో కొద్ది రోజుల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానంలో గెలుపు ఎవరిదో తెలిసిపోతుంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండడం, మధిర నియోజకవర్గం నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తుండడం, పొంగులేటి అనుచరులు కూడా ఈ ప్రాంతంలో బలంగా ఉండడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ మెజార్టీ వచ్చే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

ఎక్కడ చూసినా ఫలితాలపైనే చర్చ

తల్లాడ: మండలంలో ఎక్కడ చూసిన ఎన్నికల ఫలితాలపైనే చర్చ జరిగింది. ఫలితాలు వెలువడేందుకు గంటల్లో మాత్రమే సమయం ఆసన్నమౌతుండటంతో ఉత్కంఠ భరితంగా చర్చలు కొనసాగాయి. రాజకీయ విశ్లేషకులు వారి వారి స్థాయిలో ఫలితాలపై చర్చించారు. ఇక బెట్టింగ్ రాయుళ్లు తగ్గేదేలే అన్నట్లుగా పందాలు కాశారు. ముఖ్యంగా ఏ నోటా విన్నా ఆంధ్రాలో వైఎస్ఆర్ సీపీ గెలుస్తుందా, కూటమి గెలుస్తుందా అనే దానిపై చర్చ జరిగింది. ఒక్కరోజే మండలంలోని నారాయణపురంలో రూ.కోటి రూపాయల వరకు పందాలు కాసినట్లు తెలిసింది. అలాగే కేంద్రంలో ఎన్డీఏ కూటమి, ఇండియా కూటమి అధికారంలోకొస్తుందా అనే దానిపై కూడా పందాలు కాశారు.

నకిలీలపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

వైరారూరల్: రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ కరుణశ్రీ సూచించారు. మండలంలోని తాటిపూడి గ్రామంతో పాటు వైరా పట్టణ కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్స్ దుకాణాలను ఆమె సోమవారం మండల వ్యవసాయ అధికారి ఎస్.పవన్‌కుమార్, ఎస్సై ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్‌తో కలిసి తనిఖీలు నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. రైతులు గ్రామాల్లో దళారుల దగ్గర విత్తనాలను కొనుగోలు చేయొద్దని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాలలోనే విత్తనాలను కొనుగోలు చేసి వ్యాపారుల వద్ద నుంచి రశీదులు తీసుకోవాలన్నారు. దుకాణాదారులు తమ దుకాణాలలో ఎప్పటికప్పుడు స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకటనారాయణ, ఏఈఓలు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు..

ముదిగొండ: మండలంలోని మాధాపురం, మేడేపల్లి, సువర్ణాపురం, కమలాపురం గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో వ్యవసాయాధికారిణి రాధ సోమవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో విత్తన నిల్వలు, ఎరువులు, రికార్డులను ఆమె పరిశీలించారు.

ముగిసిన త్రిరాత్రి ఉత్సవాలు




అయ్యగారిపేటలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ జయంతి త్రిరాత్రి మహోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామికి గంధ సింధూరం, తమలపాకులతో అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. సుమారు రెండువేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో చల్లగుండ్ల కృష్ణయ్య, బొంతు మాధవరావు, నాగళ్ల ప్రసాద్, బొంతు చంద్రశేఖర్, వల్లభనేని పవన్, పురుషోత్తం, రవి, కొప్పుల రజిని, రాజ్యం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుకు సాగు కష్టాలు..

- రుణాలు అందక ఇక్కట్లు
- రుణ అర్హత కార్డుల ఊసే లేదు
- ప్రైవేట్ వ్యాపారుల వద్దే రుణాలు
- సాగు చేయలేమంటున్న వైనం..



పొలంలో అరక దునుతున్న రైతు

చింతకాని: రైతు దేశానికి వెన్నెముక అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయానికి కౌలురైతు ఆయువుపట్టు. వ్యవసాయంలో ఒడిదుడుకులు ఎదురైన ప్రతిసారీ ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతాంగంలో అత్యధికులు కౌలు రైతులే ఉంటున్నారు. కౌలు రైతులకు రుణాలను అందించాలనే ఉద్దేశ్యంతో 2015లో రుణ అర్హత కార్డు (ఎల్ఈసీ)లను జారీ చేసిన గత ప్రభుత్వం తర్వాత కౌలు రైతుల గురించి పట్టించుకోలేదు. మండలంలో కౌలు రైతులకు సంబంధించి అధికారిక లెక్కలు ఏమీ లేవు. 2015లో మండలంలో కౌలు రైతులు సుమారు 2వేల మందికి పైగా ఉండగా వారిలో కేవలం 436 మంది కౌలు రైతులకు మాత్రమే రుణఅర్హత కార్డులను అందజేశారు. వారిలో కేవలం 81 మందికి మాత్రమే బ్యాంక్‌లు ఆనాడు రూ.11.50 లక్షల పంట రుణాలను అందజేశారు.

ప్రైవేట్ వ్యాపారులే దిక్కు..

ప్రతి సీజన్‌కు పంట రుణాలను ఇవ్వాల్సిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవటంతో కౌలు రైతులంతా పంటల సాగుకోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది. సాధారణ రైతు ఒక ఎకరంలో పత్తి సాగుచేయాలంటే కనిష్టంగా రూ.55 వేలు ఖర్చు అవుతుంది. కౌలు రైతు అయితే అదనంగా రూ.20 నుంచి రూ.30 వేలు కౌలు చెల్లించాలి కనుక కౌలు రైతుకు ఎకరం సాగుకు రూ.85 వేలు పెట్టుబడి ఖర్చు వస్తుంది. ఈ పెట్టుబడి ఖర్చులన్నీ వడ్డీకి తెచ్చుకోవాల్సిందేనని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా రైతులకు అందించే పెట్టుబడి సాయం ఎకరానికి రూ.15 వేలతో పాటుగా పంటరుణాలు, పంట నష్ట పరిహారాలు, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు వంటి ప్రయోజనాలను కూడా తాము పొందలేకపోతున్నామని కౌలు రైతులు వాపోతున్నారు. పంట రుణం తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడటం తప్ప మరోమార్గం ఉండటం లేదని కౌలు రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంటల సాగుకు రుణాలను ఇప్పించి ఆదుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

రుణాలు అందించాలి..



పెరిగిన పెట్టుబడి ఖర్చులతో పంటల సాగు కష్టతరంగా ఉంది. గతేడాది కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటలను సాగు చేయగా గిట్టుబాటు ధరలు లేక తీవ్ర నష్టం వాటిల్లింది. బ్యాంక్‌లు పంట రుణాలు ఇవ్వక బయట అప్పులు తెచ్చి పంటలను సాగు చేస్తే అప్పులే మిగిలాయి. ప్రభుత్వం, బ్యాంక్‌లు పంట రుణాలను అందించి ఆదుకోవాలి.

– పగడాల పుల్లయ్య, కౌలు రైతు, మత్కేపల్లి

ఆచరణలో విఫలం..



కౌలు రైతులకు పంటల సాగుకై వేలాది కోట్లు రుణాలుగా అందిస్తామని చెప్పిన గత ప్రభుత్వం ఆచరణలో పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వం చెప్పేదానికి బ్యాంకర్లు చెప్పేదానికి పొంతన లేదు. ప్రభుత్వం జారీ చేసిన రుణ అర్హత కార్డుల వలన ప్రయోజనం శూన్యం. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కౌలు రైతులకు రుణాలను అందించాలి.

– చిర్ర నారాయణ, కౌలు రైతు, మత్కేపల్లి

ముగిసిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మధిరలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

మధిర: బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు వేడుకలు నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారులు గడ్డం భద్రయ్య దంపతులు, మందడపు రామారావులను ఘనంగా సన్మానించారు. అనంతరం మదర్ థెరిస్సా మానసిక, వికలాంగుల కేంద్రం, ఆదరణ ఫౌండేషన్, ఆర్కే ఫౌండేషన్‌లలో మానసిక వికలాంగులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పార్టీ మధిర పట్టణ అధ్యక్షుడు పల్లపోతుల వెంకటేశ్వరరావు, కార్యదర్శులు అరిగె శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ యన్నంశెట్టి అప్పారావు, కౌన్సిలర్ సయ్యద్ ఇక్బాల్, శివాలయ మాజీ చైర్మన్ కటికల సత్యనారాయణ, ఎంపీటీసీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వైరాలో తెలంగాణ ఉద్యమకారులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

వైరా: తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దే అని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అన్నారు. వైరాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ దశాబ్ధి ఉత్సవాలు సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం స్థానిక వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో ఎన్నో ఉద్యమాల ఫలితంగా తెలంగాణ ఏర్పడిందని రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశారన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్టేట్ ర్యాంకర్‌కు అభినందనలు



హరీశ్‌ను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

పెనుబల్లి: పాలిసెట్ ఫలితాలు సోమవారం వెల్లడి కాగా, పెనుబల్లి మండలం మండలపాడుకు చెందిన తుమ్మటి హరీశ్ ఎంపీసీ విభాగంలో 120కి 120 మార్కులతో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించాడు. పెనుబల్లిలోని రమేష్ స్కై స్కూల్‌లో పదో తరగతి పూర్తిచేసిన ఆయన 10 జీపీఏ సాధించడంతో పాటు ఇక్కడే కోచింగ్ తీసుకోని పాలిసెట్‌లో సత్తా చాటాడు. ఆయనను పాఠశాల ప్రిన్సిపాల్ కూరివెటి రమేష్‌బాబుతో, ఉపాధ్యాయులు అభినందించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



15వ వార్డులో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో వార్డు కౌన్సిలర్ కోన ధనికుమార్ ఆధ్వర్యంలో సోమవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. మిషన్ భగీరథ పథకంలో అసంపూర్తిగా ఉన్నటువంటి పనులను పూర్తి చేసి ప్రజలు పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షఫీ ఉల్లా, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ బ్రాంచ్ క్యాషియర్‌కు సన్మానం



క్యాషియర్ బోడా భద్రును సన్మానిస్తున్న సిబ్బంది

తల్లాడ: తల్లాడ ఎస్‌బీఐ క్యాషియర్ బోడా భద్రు గత ఐదు సంవత్సరాలుగా విశిష్ట సేవలందించారని తల్లాడ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. తల్లాడ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో సోమవారం బదిలీపై ఏన్కూర్ బ్రాంచ్ కెళ్తున్న క్యాషియర్ భద్రు సన్మాన సభలో ఆయన ప్రసంగించారు. విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన వారు పదికాలాల పాటు గుర్తుంటారన్నారు. వివరించారు. కరోనా కష్ట కాలంలో సైతం ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది బాలు, శ్రీనివాసరావు, ముస్తఫా, వ్యాపారులు బాజోజు శేషభూషనం, బెల్లంకొండ ఆజనేయులు, చాపల నరసింహారావు, ఎండి.బహదూర్, సరికొండ నరేష్‌రాజు, శ్రీను పాల్గొన్నారు.

హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి



చెన్నూరు-పెద్దకోరుకొండి మధ్య మధిరరోడ్డులో కాలిపోయిన హరితహారం మొక్కలు

కల్లూరురూరల్: రోడ్డు వెంట పచ్చదనంతో పాటు ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పేందుకు వేసిన హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. చెన్నూరు నుంచి పెద్ద కోరుకొండి వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా కల్లూరు-మధిర వెళ్లే రోడ్డు వెంట వేసిన హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. రోడ్డు పక్కన చెత్తాచెదారం ఎండిపోయాయి. అటుగా వెళ్లే ప్రయాణికులు బీడీలు, సిగరేట్లు కాల్చి పక్కనే పడవేయడంతో చెత్తకు నిప్పంటుకుని హరితహారం మొక్కలు కాలిపోతున్నాయి.

ప్రయాణం ప్రమాదమే..



లక్ష్మీపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



గద్దలగూడెం వద్ద ఏరు సమీపంలో..



గుబ్బగుర్తి వద్ద ఉన్న మూలమలుపు

ప్రమాదకరంగా మూలమలుపులు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- భయాందోళనలో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారుల మూల మలుపులు భారీగా ఉండటంతో అనేక మంది ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఈ రహదారుల వెంట నిత్యం వందలాది మంది వాహనాదారులు ప్రయాణాలు సాగిస్తున్నా.. సదరు శాఖల అధికార్లు మాత్రం ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

కొణిజర్ల: మండలంలోని చిన్నగోపతి, తుమ్మలపల్లి, లక్ష్మీపురం, గద్దలగూడెం, ఉప్పలచలక, సింగరాయపాలెం వెళ్లే రహదారుల్లో అనేక చోట్ల మూల మలుపులు యూ ఆకారంలో ఉన్నాయి. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా గుబురుగా చెట్లు పెరగడంతో మూల మలుపులు దగ్గరకు వచ్చే వరకు కనిపించే పరిస్థితి లేకుండా పోయింది. రాత్రి వేళల్లో అయితే ప్రయాణం కత్తిమీదసాము లాంటిదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు..

గతంలో అనేక మార్లు లక్ష్మీపురం వద్ద ఉన్న మూల మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరిగి తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితం అయిన వారు అధికంగానే ఉన్నారు. చిన్నగోపతి ఊరి మధ్యలోనే రెండు మూల మలుపులు ఉండటంతో ఇళ్లల్లో నుంచి అకస్మాత్తుగా ఎవరు వస్తారో, ఎటునుంచి ఏ వాహనం వస్తుందో తెలియక భయంతో వాహనాలు నడాపాల్సి వస్తుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఇటీవల గ్రామంలో కొత్తగా తారు రోడ్డు నిర్మిస్తున్న సందర్భంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అడిగినా అధికార్లు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పల చలక వద్ద.. ఉప్పచలక నుంచి మూలగూడెం వరకు సుమారు నాలుగు మూల మలుపులు ఉన్నాయి. ఈ రోడ్డుపై పలు గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం జిల్లా కేంద్రం ఖమ్మంకు వెళ్తుంటారు.

ఈ రోడ్డుపై కూడా ఎక్కడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికార్లు స్పందించి మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

బోర్డులు ఏర్పాటు చేయాలి..



మూల మలుపుల దగ్గర ఎటువంటి ప్రమాద సూచికల బోర్డులు లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రమాదాలు మరిన్ని జరుగుతున్నాయి. వర్షాకాలం నిత్యం ప్రమాదాలు చూడాల్సి వస్తుంది. అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– పాముల వెంకటేశ్వర్లు, గుండ్రాతిమడుగు